## బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ నేత ప్రవీణ్



టీడీపీకి ఇటీవల రాజీనామా చేసిన అంబర్‌పేట నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్ తన అనుచరులతో కలిసి బుధవారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. *- అంబర్‌పేట, నవంబర్ 8*

# సర్వే తీరు మారింది

### *ఎన్నికల వేళ ఆన్‌లైన్ వేదికగా సర్వేల జోరు*

- **ట్విట్టర్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లో విస్తృత సమాచార సేకరణ**
- **ఉత్సాహంగా పాల్గొంటున్న నెటిజన్లు**
- **పొలిటికల్ సర్వే ఏజెన్సీలకు ధీటుగా డిజిటల్ మీడియా సర్వేలో హోరు**

సిటీబ్యూరో, నవంబర్ 8(నమస్తే తెలంగాణ) : ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుంది. మీరెవరికీ ఓటేస్తారు. తెలంగాణలో గెలిచే పార్టీ ఏంటీ? కింద పేర్కొన్నవారిలో ఏ అభ్యర్థి గెలుస్తారు? అంటూ ఒకప్పుడు పొలిటికల్ ఏజెన్సీల స్థానికంగా తిరుగుతూ సర్వే చేసేవారు. కానీ అందుబాటులోకి వచ్చిన డిజిటల్ మీడియా ప్లాట్‌ఫాంలపై ప్రతి ఒక నెటిజన్ సర్వే నిపుణుడి అవతారం ఎత్తుతున్నాడు. అలా సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుత అసెంబ్లీ తీరుతెన్నులు, పార్టీల స్థితిగతులు, రాజకీయ నాయకుల భవితవ్యాన్ని తెలుసుకునే పనిలో పడ్డారు. ఒకప్పుడు సంప్రదాయ సర్వే విధానాల కంటే కంటే వేగంగా, ఎక్కువ మంది డిజిటల్ సర్వేలలో పాల్గొంటుండగా, జనాల నుంచి వచ్చే స్పందన కచ్చితత్వంతోనే ఉంటుంది. అయితే కొంత మంది నెటిజన్లు పార్టీలను అభిమానిస్తూనే పర్సనల్ వేదిక ద్వారా ఈ తరహా సర్వేలు నిర్వహిస్తూ ప్రజా నాడీ తెలుసుకునే వారు కూడా ఉన్నారు.

విస్తృతంగా వ్యాప్తి చెందిన సోషల్ మీడియా అసెంబ్లీ ఎన్నికల్లోనూ వినియోగిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా అభ్యర్థుల ప్రచారం, రాజకీయ అంశాలను మాత్రమే పంచుకునే స్థాయిలో నుంచి... యూజర్ల అభిప్రాయాలు, మనోగతాన్ని తెలుసుకునే సర్వే వేదికలు నిలుస్తున్నాయి. సాధారణ పొలిటికల్ సంబంధిత విషయాల కంటే రాజకీయ పరమైన అంశాలపై జనాల అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం డిజిటల్ మీడియా యూజర్లు గణనీయంగా పెరిగిన తరుణంలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిణామాలు, పార్టీలు చేసిన అభివృద్ధి, నాయకుల పని తీరును సోషల్ మీడియా వేదికనే ఆడిట్ చేస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ మీడియా మాధ్యమాలను సర్వే చేసేందుకు వేదికలుగా చేసుకుని నిర్వహిస్తున్నారు.

### సర్వే వేదికలుగా సోషల్ మీడియా

ఎక్కువ మంది యూజర్లు ఉండే ఇన్‌స్టా, యూట్యూబ్, ఎక్స్(ట్విట్టర్) వంటి మాధ్యమాలను ఇప్పుడు సర్వే వేదికలుగా మారిపోతున్నాయి. ఫాలోవర్స్ లెక్కన పొలిటికల్ స్టేటస్ తెలుసుకునేందుకు నెటిజన్లు వినియోగిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో ఫలానా పార్టీ గెలుస్తుందా? ఈసారి ఎన్నికల్లో ఏ పార్టీకి మీరు ఓటు వేస్తారు? సీఎం అభ్యర్థిగా ఎవరూ ఉండాలి? ఇలా ప్రస్తుత రాజకీయాల చుట్టూనే తిరుగుతున్నాయి. దీంతో సోషల్ మీడియాలో వినియోగించే వారంతా సర్వేలో వ్యక్తిగత అభిప్రాయాలను తెలుపుతున్నారు. నిజానికి ఎన్నికలు వచ్చాయంటే పొలిటికల్ ఏజెన్సీలు, సర్వే సంస్థలు పార్టీలను ఆశ్రయించి, ఇంటింటికి, గ్రామాలు, పట్టణాలు, సంబంధిత నియోజకవర్గంలో తిరుగుతూ స్థానికుల అభిప్రాయాలు సేకరించడం, వాటి ఫలితాలను ఆయా పార్టీలకు అందజేయడం షరా మామూలే. కానీ సోషల్ మీడియా అకౌంట్ ఉండి, ఫాలోవర్లు ఉన్న యూజర్ తప్పనిసరిగా పొలిటికల్ నేపథ్యం ఉండే విషయంపై నెటిజన్ల అభిప్రాయాన్ని తెలుసుకుంటున్నారు. ఇలా సాధారణ, సంప్రదాయ సర్వేలకు ధీటుగా సోషల్ మీడియా మాధ్యమాల్లో సర్వే ట్రెండ్ నడుస్తోంది. పొలిటికల్ అనలిస్టులు కూడా రాజకీయ నిపుణులు కూడా సోషల్ మీడియాను వినియోగించుకుని జనాల నాడీని తెలుసుకునేందుకు వాడుతున్నారు.



ఉప్పల్ మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు, మహిళా నేతలు

# అక్కా.. చెల్లెళ్లు ఓసారి ఆలోచించండి

- **మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశాం**
- **సీఎం కేసీఆర్ ఏ పథకం చేపట్టినా మహిళల పేరుతోనే..**
- **కాంగ్రెస్ గెలుసుడు వద్దు... పేకాట క్లబ్బులు వద్దు**
- **ఉప్పల్ మహిళల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి హరీశ్ రావు**



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన మహిళలు

ఉప్పల్, నవంబర్ 8 : మహిళల భద్రతకు భరోసాతోపాటు, మహిళా సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ వస్తే పేకాట క్లబ్బులు వస్తాయన్నారు. మహిళల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తున్నదని చెప్పారు. మాటతప్పని సీఎం కేసీఆర్‌కు అండగా ఉండాలని.. అక్కా చెల్లెళ్లు ఓ సారి ఆలోచించాలన్నారు. ఉప్పల్ మల్లాపూర్‌లోని వీఎన్ఆర్ గార్డెన్‌లో బుధవారం ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన మహిళల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఉప్పల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మంచినీళ్ల కష్టం తీర్చామని, ఉచితంగా ఇంటింటికీ నీళ్లు అందిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో ప్రభుత్వాలు అవార్డులు ఇస్తూ, గల్లీలో తిట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఒక్కసారి అవకాశం ఇవ్వమని అడుగుతున్నారని, ఒక్కసారి కాదు 11 సార్లు ఓటేసినా కాని గోస తీరలేదన్నారు. కాంగ్రెస్‌పార్టీని నమ్మితే ఎండమావులను నమ్మినట్లే, కర్ణాటకలో లాగా ఆగం అవుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కరువులేదు.. కర్ఫ్యూలేదని, కాంగ్రెస్ హయాంలో కత్తిపోట్లు, కర్ఫ్యూలతోనే ప్రజలు ఇబ్బంది పడ్డారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రాజస్థాన్‌లోనే మహిళలకు భద్రత లేదన్నారు. బీఆర్ఎస్ గెలిచిన తరువాత పేదలందరికి బీమాను అందిస్తామని, రేషన్ సన్నబియ్యం అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్యం మెరుగుపడిందని, పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నామన్నారు. రాదన్న..కాదన్న తెలంగాణను తీసుకువచ్చిన సీఎం కేసీఆర్‌కు, పథకాలను అమలు చేయడం పెద్ద విషయం కాదన్నారు. సీఎం కేసీఆర్ అంటేనే నమ్మకమని తెలిపారు. బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి ఓటేసి లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, ఓటు ఎందుకు వేయాలో తెలియజేస్తూ.. మ్యానిఫెస్టోను రావుల శ్రీధర్‌రెడ్డి ఈ సందర్భంగా మహిళలకు వివరించారు.

### మెజార్టీతో గెలిపించండి: ఎమ్మెల్యే బేతి



బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారులు, మహిళలు ఎన్నికల్లో బండారికి సహకారం అందించాలన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో ఉప్పల్‌ను అగ్రగామిగా నిలిపామని తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి, బండారి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు.

### కాంగ్రెస్‌పార్టీకి కార్యకర్తలు కూడా దొరకని పరిస్థితి: సోమశేఖర్‌రెడ్డి

ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలు కూడా దొరకని పరిస్థితి ఉందని బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలు గుర్తించాలన్నారు. నాయకులనే మోసం చేసిన రేవంత్‌రెడ్డి, ప్రజలను కూడా మోసం చేస్తారన్నారు. బండారి లక్ష్మారెడ్డి కోసం 20 రోజులు పనిచేయాలని, అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఉప్పల్‌లో గులాబీ జెండా ఎగురవేయాలని, హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతిసాయిజెన్ శేఖర్, ప్రభుదాస్, బొంతు శ్రీదేవి, బన్నాల గీతాప్రవీణ్ ముదిరాజ్, సింగిరెడ్డి శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్లు పావనీరెడ్డి, గంధం జ్యోత్స్ననాగేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, సాయిజెన్ శేఖర్, కటార్ల భాస్కర్, భాస్కర్, సంతోష్‌రెడ్డి, మహేందర్, మహిళలు పాల్గొన్నారు.

### మహిళా సంక్షేమానికి కృషి చేస్తాం : ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



మహిళా సాధికారతతోపాటు, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఉప్పల్ బీఆర్ఎస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ కలిసి 2 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు. మహిళలు అభ్యున్నతి సాధించే విధంగా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. పేద, మధ్యతరగతి వారికి తన ట్రస్టు ద్వారా విద్య, వైద్యం కోసం తోడ్పాటు అందిస్తున్నామని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌కు జై కొట్టిన మైసిరెడ్డిపల్లి

### *మంత్రి మల్లారెడ్డి సమక్షంలో చేరిక*



మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మైసిరెడ్డిపల్లి గ్రామస్తులు

మేడ్చల్, నవంబరు 8 : మేడ్చల్ మండలంలోని మైసిరెడ్డిపల్లి గ్రామం బీఆర్ఎస్‌కు జై కొట్టింది. మండల కేంద్రానికి దూరంగా ఉన్న గ్రామం అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ ఒక్కటే మార్గమని భావించారు. ఎన్నో ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నా అభివృద్ధి జరగలేదని గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నిషితారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు మూకుమ్మడిగా బీఆర్ఎస్‌లో చేరారు. మేడ్చల్‌లోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మంత్రి చామకూర మల్లారెడ్డి సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ అంటే అభివృద్ధి, కేసీఆర్ అంటే నమ్మకమన్నారు. నియోజకవర్గంలో ఎక్కడా చూసినా బీఆర్ఎస్సే ఉందన్నారు. 13 ఏండ్ల నుంచి కాంగ్రెస్‌లో ఉన్న మైసిరెడ్డిపల్లి గ్రామస్తులు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి చూసి నిషితారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారని చెప్పారు. కళ్లల్లో ఒత్తులు వేసుకొని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, సొంత నిధులతో సైతం ఊరూరికి రోడ్లు వేయించానని, గుళ్లను అభివృద్ధి చేశామని తెలిపారు. కాంగ్రెస్ నేతల మాయ మాటలు ఎవరూ నమ్మొద్దన్నారు. నిషితారెడ్డితో పాటు బుచ్చిరెడ్డి, సంజీవ, భూషణం, అనిత, శంకర్‌తో పాటు దాదాపు 150 మంది బీఆర్ఎస్‌లో చేశారు. అలాగే మేడ్చల్ మున్సిపాలిటీకి చెందిన యువకులు శ్రీనాథ్ ఆధ్వర్యంలో 50 మంది మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, జడ్పీటీసీ శైలజా విజయానందారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయానందారెడ్డి, నాయకులు రాజమల్లారెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, భాగ్యారెడ్డి, రాఘవేందర్ గౌడ్, కౌన్సిలర్లు కౌడె మహేశ్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రణదీప్ రెడ్డి, సురేశ్ రెడ్డి, నారెడ్డి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.